ప్రజాశక్తి

గురువారం 7 డిసెంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు



తెనాలి మండలంలో కూలిపోయిన అరటి తోట



పొన్నూరు ప్రాంతంలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

నానుతున్న పంటలు

- లక్ష ఎకరాల్లో వరి మునక
- మరో లక్ష ఎకరాల్లో ఇతర పంటలకు ముంపు
- పెరుగుతున్న నష్టాలు
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న రైతులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మిచౌంగ్ తుపాను సృష్టించిన భీభత్సంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రెండు లక్షల ఏకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. గుంటూరు జిల్లాలో లక్ష ఏకరాల్లో వరి పంట నీట మునిగి భారీ నష్టం కలిగింది. సోమ, మంగళ వారాల్లో కురిసిన భారీ వర్షాలకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ప్రాథమికంగా రెండు లక్షల ఏకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల పంటలకు అపార నష్టం జరిగింది. గాలులకు వరి పైరు నేలకొరిగింది. వరి పంట కోసి పనలపై ఉండగా వర్షాలకు నీట మునిగింది. నీటిలో తేలియాడుతున్న వరి పనలను కుప్ప వేస్తున్నారు. వరి తడిసిపోయి రంగు మారే అవకాశం ఉంది.

పత్తి, మిర్చి, జొన్న, మొక్క జొన్న, శనగ, ఆపరాలు పొగాకు పంటలతోపాటు ఉద్యాన పంటలకు అపార నష్టం కలిగింది. అరటి తోటలు నేలకూలాయి. ఉల్లి, బొప్పాయి, పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. రబీ సీజన్ ప్రారంభం కాగానే పల్నాడు, గుంటూరు జిల్లాలో సాగు చేసిన జొన్న, మొక్క జొన్న పైర్లు నీట మునిగాయి. ఈ పైర్లు ఎంతవరకు నిలదొక్కు కుంటాయో తెలియడం లేదు. పత్తి పంటలో రెండో విడత తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి నెలరాలిపోయింది. పూత, కాయలు రాలిపోతాయి. మెట్ట ప్రాంతాల్లో పత్తి, మిర్చి పొలాల్లో నీరు నిలిచి పైర్లు ఉరకెత్తుతున్నాయి. ప్రత్తిపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ తదితర ప్రాంతాల్లో పత్తి, మిర్చి పంటలు నీట మునిగాయి. పల్నాడులో బోర్లు, బావుల కింద సాగు చేసిన వరి కోతలకి సిద్ధంగా ఉండగా వర్షాలకు దెబ్బతిన్నాయి. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పంట కాల్వల్లో కూడా నీరు భారీగా ఉండటంతో నీరు బయటకు పోవడం లేదు. దీంతో రైతులు పొలాల్లో ఉన్న నీటిని బయటకి పంపేందుకు ఎంతో శ్రమిస్తున్నారు.

వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. అమరావతి ప్రాంతంలో పెదమద్దురు వాగు ఉధృతంగా ప్రవహించడంతో అమరావతి వద్ద పంటలు నీట మునిగిపోయాయి. రాజధాని ప్రాంతంలో కోటేళ్ల వాగు, తాడికొండ ప్రాంతంలో కొండవీటి వాగు, గణపవరం వద్ద కుప్పగంజి వాగు పొంగి ప్రవహస్తున్నాయి. వాగుల పరిసర ప్రాంతాల్లో పొలాల్లోకి నీరు చేరి పంటలకు నష్టం వాటిల్లింది. నెలరోజుల్లో కురవాల్సిన వర్షం కేవలం 36 గంటల వ్యవధిలో కురిసిందని అధికారులు తెలిపారు. ఇందువల్ల పంట నష్టం ఊహించని విధంగా పెరిగిందని అంచనా వేస్తున్నారు.



యడ్లపాడులో పొలాలను పరిశీలిస్తున్న వై.రాధాకృష్ణ



అచ్చంపేట మండలంలో దెబ్బతిన్న మిర్చి పైరు



కాకుమాను మండలంలో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న నాయకులు

నష్టాన్ని బాగా తగ్గించాలి

- పొలాల్లో నీటిని వెంటనే బయటకు పంపండి
- సరుకుల కిట్ల పంపిణీ సత్వరమే పూర్తి చేయాలి
- అధికారులకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో నీట మునిగిన పంట పొలాల్లో నీటిని సత్వరమే బయటకు పంపించి పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. రైతులకు ఉపశమనం కల్పించేందుకు ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులతోపాటు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. తుపాను సహాయక చర్యలపై అధికారులతో కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పునరావాస కేంద్రాలలోని బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో కందిపప్పు, కిలో బంగాళదుంపలతో కూడిన నిత్యావసర సరుకుల కిట్ల పంపిణీ వెంటనే పూర్తి చేయాలన్నారు. సిఎం ఆదేశాల మేరకు వ్యక్తికి రూ.వెయ్యి లేదా కుటుంబానికి రూ.2500 నగదు అందించాలన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ఇళ్లపై నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం గురువారం నాటికి పూర్తి స్థాయిలో నివేదిక అందిస్తే నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో ఇతర పంటలు, 18 వేల ఎకరాల్లో ఉద్యాన పంట పొలాల్లో నీరు చేరిందన్నారు.

ఉపాధి హామీ కూలీలను అవకాశం ఉన్న ప్రాంతాల్లో పూడికతీత పనులకు వినియోగించుకోవాలన్నారు. దీనికి అవసరమైన నిధులకు సంబంధించి అడ్వాన్స్‌లు ఇచ్చామని, మిషనరీని రవాణా శాఖ అధికారులు పూర్తి స్థాయిలో ▶ 2లో

రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

దేశాన్ని పరిపాలిస్తున్న మనువాదుల నుండి రాజ్యాంగాన్ని పరిరక్షించటమే అంబేద్కర్‌కు అర్పించే నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ▶ 2లో



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేస్తున్న నాయకులు

ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె

- సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడనాడాలి
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంగన్వాడీల సమస్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. ఈ నెల 8 నుండి అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపడతారని, ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు దాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టనంలోని పల్నాడు రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీలు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలతో వెట్టిచాకి చేస్తున్నారని, పెరిగిన ధరలతో పోలిస్తే వారికిచ్చే జీతాలతో కుటుంబాలు గడవడం కష్టమవుతోందని అన్నారు. ▶ 2లో

అంబేద్కర్ విగ్రహానికి సమస్యల వినతిపత్రం ఇస్తున్న మల్లీశ్వరి తదితరులు



రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా స్థానిక లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం లౌకికవాదం, సమైక్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు. అయితే ఆ రాజ్యాంగ విలువలను నేడు కేంద్రంలో పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని, ఆ ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి ఒకవైపు అంబేద్కర్‌ను గౌరవిస్తున్నట్టు నటిస్తూనే మరోవైపు ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్లను పరిమితం చేస్తోందని, ఉన్న రిజర్వేషన్లనూ రద్దు చేస్తోందని అన్నారు. బిజెపిని ఓడించటం ద్వారానే రాజ్యాంగాన్ని పరిక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, వై.కృష్ణకాంత్, ఎం.కిరణ్, జి.లూథర్‌పాల్, టి.జాన్‌బాబు, షేక్ ఖాసిం షహీద్, వి.నారాయణ, షేక్ సమీర్, సిహెచ్ భగత్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రతిపక్ష నేత హోదాలో ఎన్నికలప్పుడు హామీఇచ్చిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏ ఒక్క హామీనీ నేరవేర్చలేదన్నారు. పలు రకాల యాప్‌లతో ఇబ్బంది పెడుతున్నారని, బిల్లుల మంజూరులో జాప్యం చేస్తున్నారని, ఇవన్నీ అంగన్వాడీలను తీవ్ర మానసిక, ఆర్థిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయని విమర్శించారు. శ్రామిక మహిళ జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు మండల కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో కీలకమైన అంగన్వాడీల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ, కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఐసిడిఎస్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు తగ్గించి ఆ సేవలను ప్రజలకు అందకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. కె.కవిత, బి.సాయి కుమారి, ఎన్.శ్రీలక్ష్మి తదితర అంగన్వాడీలు మాట్లాడుతూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. రకరకాల యాప్‌లు తెచ్చి రోజురోజుకూ పని భారం పెంచుతున్నారని, పైగా ఇంటర్‌నెట్ సమస్యల వల్ల వివరాలు నమోదు చేయలేకపోతున్నామని చెప్పారు. ఇదే సమయంలో రికార్డులు రాయాల్సి వస్తోందన్నారు. ఏళ్ల తరబడి చాకిరీ చేసిన తమకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకుండానే ఇంటికి పంపుతున్నారని వాపోయారు. రాజకీయ వేధింపుల వల్ల అర్హులకు ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు. మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా చేసి కనీస వేతనం ఇవ్వడం ద్వారా గౌరవప్రదమైన జీవితం గడిపే అవకాశం ఇవ్వాలన్నారు. సరుకులు నాణ్యంగా ఉండడం లేదని, వీటిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ సమస్యలన్నీ పరిష్కారం అయ్యే వరకూ పోరాడతామన్నారు.

నష్టాన్ని బాగా తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమకూరుస్తారని చెప్పారు. పంట నష్టం ఇబ్బందులు తొలగించేందుకు సంబంధిత శాఖల అధికారులు, పర్యవేక్షణ అధికారులు మానవత్వంతో స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వలన దోమలు వద్ది చెంది సీజనల్ వ్యాధులు వ్యాప్తించకుండా పూర్తి స్థాయిలో డ్రెయినేజీల్లో నీరునిల్వ ఉండకుండా, దోమలు లార్వా నిర్మూలనకు ఫాగింగ్, పారిశధ్య పనులు పటిష్ఠంగా నిర్వహించాలని, తాగునీటిని క్లోరిఫికేషన్ చేసి, ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించి సరఫరా చేసేలా పంచాయతీ శాఖ, మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాన్ వల్ల జిల్లాలో జరిగిన నష్టాలపై సంబంధిత శాఖలు గురువారం నాటికి నివేదిక అందించాలన్నారు. తుపాను సమయంలో జిల్లా యంత్రాంగం నిత్యం అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్థినష్టం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు, ప్రజలకు ఇబ్బంది లేకుండా సాధరణ పరిస్థితులు వచ్చే వరకు సహాయక కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం అదే అప్రమత్తతో కొనసాగించాలని సూచించారు. సమావేశంలో గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణబాబు, సిపిఒ శేషశ్రీ పాల్గొన్నారు.

పంట నీటిపాలు.. రైతు అప్పులపాలు

- పొలాలను పరిశీలించిన రైతు సంఘం
- కష్టాలు చెప్పి ఆవేదనకు గురైన రైతులు



పాలపాడులో నీట మునిగిన మినుము పైరు.. పొలాల పరిశీలనలో నాయకులు (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆభరణాలు తాకట్టు పెట్టి పొలం పెట్టుబడులు పెట్టామని ఒకరు.. వడ్డీ వ్యాపారులు వద్ద డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని మరొకరు, భూమి తనఖా పెట్టి పెట్టుబడులు సమకూర్చుకున్నామని ఇంకొకరు ఇలా.. సాగులో తాము పడ్డ కష్టాలను, ఇప్పుడు వచ్చిన నష్టాలను రైతు సంఘం నాయకుల ఎదుట రైతులు వెళ్లబోసుకున్నారు. మిచౌంగ్ తుపాను నేపథ్యంలో రెండ్రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలన్నీ నీట మునగడమో, నేలవాలడమో అయిన నేపథ్యంలో ఆయా పొలాలను రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, ఇతర నాయకులు బుధవారం పరిశీలించారు. నరసరావుపేట మండలంలోని యలమంద, గురవాయపాలెం, కొండకావూరు, పమిడిమర్రు, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు, రొంపిచర్ల మండలం అన్నవరం, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, మినుము, పెసర, కంది, శనగ తదితర పంటలన్నీ నీటిపాలయ్యాయన్నారు. రైతులకు ప్రభుత్వం సత్వరమే పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనావృష్టి కారణంగా జిల్లాలో వరి కేవలం 20 శాతం మాత్రమే సాగు చేస్తే చేతికి వచ్చే సమయానికి అదికూడా నీటిపాలైందని తెలిపారు. మిర్చి పంటకు నిన్నటి వరకు అష్ట కష్టాలు పడి ట్యాంకర్ల ద్వారా సాగు నీరు పెట్టుకున్న రైతులను ఈ వానలు తీవ్రంగా దెబ్బకొట్టాయన్నారు. గాలికి మిర్చిలో పూత, పిందే రాలిందని, ముందే కౌలు చెల్లించిన కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రతి బాధిత రైతునూ ఆదుకోవాలని కోరారు.

రెండెకరాల మినుము మునిగింది

తిరివీధుల వెంకయ్య, రైతు. అన్నవరం, రొంపిచర్ల మండలం.



మినుము ప్రస్తుతం పిందె దశలో ఉంది. పురుగు ఉధృతంగా ఉండడం పురుగు మందులకే రూ.12 వేల ఖర్చయింది. ఇప్పటికి రూ.56 వేల పెట్టుబడి పెట్టాం. తుపాను వల్ల అదిమొత్తం నీటిపాలైంది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

ప్రభుత్వ ప్రకటనతో నిండా మునిగా

షేక్ మీరావలి, కౌలురైతు, చిన్నతురకపాలెం, నరసరావుపేట మండలం.



ఆరుతడి పంటలకే నీరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రూ.16 వేలు ముందస్తు కౌలు చెల్లించి రూ.60 వేలు వరకు పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశాను. పైరుకు నీరు రాకపోవడంతో తోటను వదిలేశాను. తుపాను వల్ల ఆశలు చిగురించాయి. పొలం వద్దకెళ్లి చూస్తే పైరంతా నేలవాలింది. దాన్ని రూ.8 వేల ఖర్చుపెట్టి పైకి లేపి బలం కోసం ఎరువులు చల్లించాను.

పోలీసు శాఖలో కీలకంగా హోంగార్డులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలీసు శాఖలో హోంగార్డుల విధులు ఎంతో కీలకమని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో 61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారం హోంగార్డులకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎస్పీ వారి నుండి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. 1963లో ఆవిర్భవించిన హెూంగార్డు వ్యవస్థ పోలీస్ శాఖ కీలకంగా మారిందన్నారు. పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలందించడం అభినందనీయమన్నారు. కష్టతర విధుల నుండి అన్నింట హోంగార్డుల పని తీరును కొనియాడారు. పోలీస్ శాఖ క్రమశిక్షణకు మారుపేరుగా హోంగార్డులను నిలిచారని నిత్యం ప్రజలతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టలు పెంచేలా హోంగార్డులు విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బందితో సమానంగానే హెూంగార్డులు కూడా సంక్షేమ చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు. పోలీస్ శాఖలోని ఆయా విభాగాలైన ట్రాఫిక్ రెగ్యులేషన్, డ్రైవింగ్, కంప్యూటర్ ఆపరేటర్, శాంతి భద్రతల పరిరక్షణ మరియు నేరాలను ఆరికట్టడం, బందోబస్తు మొదలగు విధుల్లో హోంగార్డులు పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి అనిర్వచనీయ సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది 12 మంది హోంగార్డ్స్ కుటుంబాలకు ఒకరోజు వేతన వితరణ కింద రూ.63.80 లక్షలు వితరణ చేశారన్నారు. పోలీసు కానిస్టేబుల్స్ పోస్టుల కొరకు దరఖాస్తు చేసుకొనే హోంగార్డ్స్ కు సివిల్ పోస్టనకు 15 శాతం, రిజర్వేషన్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టులకు 20 శాతం రిజస్వేషన్ కల్పిస్తున్నామన్నారు. హోంగార్డ్స్ సహజ మరియు ప్రమాదవశాత్తు మరణము పొందిన సందర్భంలో మట్టి ఖర్చులకు జిల్లా హోంగార్డ్స్ వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.10 వేలతో పాటు జిల్లా ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.10 వేలు అదేవిధంగా, సాధారణ మరణం పొందిని వారి కుటుంబానికి సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.10 వేలు మట్టి ఖర్చులకు, మరణ ప్రయోజనాలు క్రింద రూ.15 వేలు ప్రమాదవశాత్తు మరణము పొందిన వారి కుటుంబానికి రూ.20 వేలు, సహజ మరణము పొందిని వారి కుటుంబానికి రూ.5 లక్షలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియోగా ఇస్తుందని వివరించారు. హోంగార్డులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హోంగార్డులు సమస్యలను విన్నవించగా పరిష్కారానికి హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రామచంద్రరాజు, చంద్రశేఖర్, డీఎస్పీలు మహేష్, రవిచంద్ర, చిన్నికృష్ణ, సిఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



మహిళా హోంగార్డుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

61వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా పలువురి ఎస్పీ అభినందన

'కుల నిర్మూలన' చదవకుండా దేశాన్ని అర్థం చేసుకోలేం

జూపూడి ప్రభాకర రావు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

కుల నిర్మూలన పుస్తకం చదవకుండా భారతదేశ సమాజాన్ని, చరిత్రను అర్థం చేసుకోలేరని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుదు జూపూడి ప్రభాకరరావు అన్నారు. బుధవారం సాయంత్రం బ్రాడీపేటలోని కొరటాల మీటింగ్ హాలులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బి.విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచన కుల నిర్మూలన పుస్తకాన్ని జూపూడి ప్రభాకరరావు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోని 10 మంది మేధావుల్లో ఒకరైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భారతదేశంలో జన్మించడం తనకు గర్వ కారణంగా ఉందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లేని భారతదేశాన్ని ఊహించలేమన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాదిసంకూరి రాజారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, విసికే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ, వి.యోహాలు, ఎస్ ఎం సుభాని, న్యాయవాది పి.ప్రసాద్ పాల్గొన్నారు.





అనంతవరంలో నినాదాలు చేస్తున్న రైతులు , మహిళలు

అమరావతిని విస్మరించడం తగదు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్రాభివృద్ధికి దోహదపడే అమరావతి రాజధానిని విస్మరించడం తగదని ప్రభుత్వానికి రైతులు హితవు పలికారు.బుధవారం బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అనంతవరంలో రైతులు, మహిళలు ' రాజ్యాంగాన్ని గౌరవించాలి - అమరావతిని నిర్మించాలంటూ..' నినాదాలు చేశారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు 1450వ రోజుకు చేరాయి. వెంకటపాలెం,మందడం,నెక్కల్లు,అనంతవరం, తుళ్లూరు తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి



సత్తెనపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

సామాజిక దార్శినికుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని రాష్ట మంత్రి అంబటి రాంబాబు అన్నారు . బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ 63వ వర్థంతి సభలో ఆయన ముఖ్య అతిథి పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్‌ను స్మరించుకోవటం మన అందరి బాధ్యత అని అన్నారు. అదేవిదంగా తాలూకా సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పరివర్తన వికలాంగుల ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణి చేశారు. పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు కలాం చేయూత వ్యవస్థాపకులు వెలుగురి శరత్‌ఆర్థిక సౌజన్యంతో అందించిన నాలుగు చక్రాలతోపుడు బండిని 31వ వార్డుకు చెందిన మహిళకాస్తాల సైదామ్మకు మంత్రి అందజేశారు.సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ పట్టణంలోని తాలూకా సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తన అనుచరులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యేకి వ్యతిరేక వర్గంగా తెరమీదకు వచ్చిన వైసిపి నేత బాపట్ల నియోజకవర్గ పరి శీలకులు గజ్జల బ్రహ్మారెడ్డి కూడా అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . అనంతరం మెయిన్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞన్ రాజ్ పాల్ అధ్యక్షత వహించారు.



ప్రజాశక్తి-క్రోసూరు

ఆమంచి విజ్ఞాన కేంద్రాల్లో సిపిఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం క్రోసూరు గ్రామ కార్యదర్శి చిల్కా ఏషియ్య పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రవిబాబు మాట్లాడుతూ అంబేద్కర్ వంటి మహెూన్నతమైన వ్యక్తిని కేవలం ఒక వర్గానికి సంబంధించిన వ్యక్తిగా ముద్ర వేసి ప్రచారం చేయడం అన్యాయమని అన్నారు . పి.అనూష, ఎస్‌కె. ముస్తఫా, దుద్దుల ఇశ్రాయేలు, పిల్లి రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని అంబేద్కర్ విగ్రహనికి పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాచర్ల చినఏసోబు మాట్లాడారు. ఈ కార్యక్రమాలలో వైసిపి, తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్, యుటిఎఫ్, పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ వర్ధంతి వేడుకలలో ఎంపిపి గడ్డం వెంకట్రావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు. నల్లగార్లపాడు గ్రామంలో దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గోదా రమేష్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. మండల యూత్ అధ్యక్షులు బూదాటి సంసోన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు జరిగాయి.



ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బహుజన్ సమాజ్ పార్టీ వినుకొండ నియోజకవర్గం అధ్యక్షులు వినుకొండ రాంబాబు హాజరై మాట్లాడారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య కమిటీ ఆధ్వర్యంలో వినుకొండ నియో జకవర్గం మాల మహానాడు కార్యాలయంలో ఘన నివాళులర్పించారు.వినుకొండ జాషువా సాంస్కృతిక సమైక్య ఆధ్వర్యంలో , పట్టణ టిడిపి అధ్య క్షుడు పఠాన్ ఆయ్యుబ్ ఖాన్ అధ్వర్యంలో నివాళులర్పించారు.

ప్రజాశక్తి- విజయపురిసౌత్

మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లా డారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, రెవిన్యూ అధికారి వినాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు, పాల్గొన్నారు.

త వైసిపి కార్యాలయంలో, టిడిపి జిల్లా, టిడిపి నియోజకవర్గ కార్యాలయాల్లో, కాంగ్రెస్, జనసేన కార్యాలయాల్లో నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి-నకరికల్లు

నకరికల్లు ప్రజలు వరుస చైన్ స్నాచింగ్ లతో హడలెత్తిపోతున్నారు. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకార నర్సింగపాడు గ్రామానికి చెందిన కేతినేని రాజేశ్వరి నకరికల్లు లోని తన తల్లి ఇంటి వద్దత టిఫిన్ బండి నడుపుతుంటారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో నకరికల్లు వై జంక్షన్ నుంచి నడుచుకుంటూ మెయిన్ రోడ్డు లోని ఏటీఎం దగ్గర ఉన్న వాళ్ళ అన్నయ్య ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని నాన్ తాడు ను లాక్కొని వెళ్ళాడు. బాధితురాలు కేకలు వేసింది. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చైన్ స్నాచిం గ్ జరిగిన తీరును సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. మంగళవారం కూడా గ్రామంలోని ప్రధాన రహదారిలోని కాళంగి వెంకటరత్నం మెడలోని నాలుగు సవర్ల నాన్ తాడు దొంగ తనం జరిగింది. గ్రామంలో సీసీ కెమెరాల నిఘా ఉన్న దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-నాదెండ్ల



తుఫాన్ ప్రభావానికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డిడిఎ ఎం.శివకుమారి నరసరావుపేట ఏ డి ఏ పీ మస్తానమ్మ నాదెండ్ల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ బుధవారం నాదెండ్ల చిరుమామిళ్ల కనపర్రు సాతులూరు గ్రామాల్లో దెబ్బతిన శనగ కంది పత్తి పంట పొలాలను పరిశీలించారు రైతులకు అవగాహన కల్పించారు పొలం లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటికి పంపించుకోవాలని కంది పంటలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి పూత పింద వచ్చేందుకు ఒక ఎకరాకి 191919 ఒక కిలో ఫార్ములా 41/2 కేజీ కలిపి పిచికారి చేయాలి సెనగ పంటలో నీరు నిలువ ఎక్కువ లేకుండా చూసు కోవాలి ఎక్కు వగా ఉన్నట్లయితే నీటిని బయటికి పంపాలి దాతు లోపం రాకుండా ఉండేందుకు ఫెర్రస్ సల్ఫేట్ ఒక ఎక రాకి ఒక కేజీ నిమ్మొ ప్పు 200 గ్రాములు యూరి యా ఒక కేజీ కలిపి పిచికారి చే న ు కో వా ల ని తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 18,688
మిర్చి ఎగుమతి	: 17,861
మిర్చి నిల్వ	: 13,807

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 22,000
నెం.5	15,000 - 15,000
341	10,000 - 22,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 23,500
బడిగి	13,000 - 24,000
దేవనూరు డీలక్స్	13,000 - 29,000
తాలుకాయలు	5,000 - 13,500
	ఎసి
334	9,000 - 22,000
341	15,000 - 19,500
తేజ	10,000 - 23,300
బడిగి	13,000 - 20,000
దేవనూరు డీలక్స్	16,000 - 19,000
తాలుకాయలు	7,000 -12,000

బీసీలకు సరైన గుర్తింపు కోసమే కులగణన

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ప్రజాశక్తి-అమరావతి

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అమరావతి మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రంలో బీసీలకు సరైన గుర్తింపు కల్పించేందుకు కులగణన చేపట్టినట్టు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అమరావతి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కులగణన అవగాహన సదస్సులో శంకరరావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలు, చట్టసభల్లో ప్రాతినిధ్యం వంటి వాటిలో న్యాయం జరిగేందుకే కులగణన చేపడుతున్నట్టు చెప్పారు. ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సర్వే జరుగుతందన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సాయంలో కులగణన చేపట్టనున్నట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటీర్ వ్యవస్థ రాష్ట్రంలో ఉందని. తద్వారా కులగణన చాలా సులభమవుతుందన్నారు. కులగణలో ప్రజలు కూడా నిజాయితీగా తమ వివరాలను అందజజేయాలని కోరారు. ఏ గ్రామంలో ఉన్నవారు అక్కడే కులగణనలో పాల్గొనాలన్నారు. కులగణన వల్ల సంక్షేమ పథకాలు సక్రమంగా అందించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఎన్నికలు, ప్రభుత్వ, నామినేటెడ్ పదవులను కూడా జనాభా ప్రాతిపదికన అందించే అవకాశముంటుందన్నారు. అన్ని వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా పదవులు కల్పించిన ఘనత సీఎం జగన్ దేనన్నారు.గత నాలుగేళ్లలో తమ ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. కుల జనాభా స్పష్టంగా తెలిస్తే.. వారికి దక్కాల్సిన ఫలాలు సక్రమంగాఅందుతాయన్నారు. ఈకార్యక్రమంలో భవిరిశెట్టి హనుమంతరావు, నాయుడు రాంబాబు, షేక్ హష్మీ, ఈదా సాంబిరెడ్డి,మంగిశెట్టి కోటేశ్వరరావు, మాదాసు పావనిరాంబాబు, ఎంపీడీవో పి ఉమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



బురద అంటిన మిరపకాయలను కడుగుతున్న రైతులు

పట్టాలు కప్పినా తడిచిన మిర్చి పంట

ప్రజాశక్తి - మాచర్ల

మిచౌంగ్ తుపాను నేపథ్యంలో కురిసిన వానల వల్ల మాచర్ల పరిసర గ్రామాల్లోని మిర్చి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విచ్చిన పత్తి పాడైపోయింది. కోత కోసిన మిర్చి కళ్లాల్లో ఉండగా రెండ్రోజుల పాటు జోరు వాన కారణంగా పట్టాల కిందకు నీరు చేరి తడిశాయి. జమ్మలమడక తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన పొలాలకు తీవ్రంగా నష్టం జరిగింది. కళ్లాల్లో మిర్చి తడిచి బురద పాలైంది. అయినా రైతులు వాన బుధవారం తెరపిఇవ్వటంతో తడిచిన మిర్చిని కడిగి అరబోసుకుంటున్నారు.



ఉధృతంగా వాగులు, చెరువులు

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో రెండ్రోజులపాటు ఎడతెరిపి లేని వానతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు, చెరువులు, కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విప్పర్లపల్లి సమీపంలో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలకు అవాంతరం లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో గ్రామాల్లో అంథకారం నెలకొంది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడం వల్ల పలుచోట్ల పెద్ద చెట్లు పడిపోవటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వానలకు పంటపొలాలు నీటమునిగాయి. మిర్చి, శనగ, మొక్కజొన్న, మినుము తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బోర్లు, బావుల క్రింద సాగుచేస్తూ చేస్తున్న వరి కోతకొచ్చిన తరుణంలో వానల వల్ల నేలవాలింది. ఓదెల మీద ఉన్న పంట నీటి పాలైంది. మండలంలో అన్ని గ్రామాలలో

రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

తుపాను బాధిత రైతుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు కోరారు. బుధవారం మండలంలోని చిన్నమెక్కెన, పరస, ఖమ్మంపాడులో దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. ఆయన ఎం.శ్రీనివాసరావు, రైతులున్నారు.





యడ్లపాడులో పొలాల్లో నిలిచిన నీరు.. వాగుల్లో నీటి ఉధృతి



అమరావతి మండలంలో నీటి మునిగిన మిర్చి పొలాలు

మొన్నటి వరకూ కష్టం.. ఇప్పుడు నష్టం..

తుపాను బారిన పంటలు - తాలుకాయలు అవుతాయని మిర్చి రైతుల ఆవేదన - పరిశీలించిన రైతు, కౌలురైతు సంఘాలు - మిర్చికి ఎకరాకు రూ.50 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, కౌల్దార్లకు నష్టపరిహారం అందేలా చూడాలని డిమాండ్

ప్రజాశక్తి - యడ్లపాడు

పంటలు పండించడానికి, కాపాడుకోవడానికి రైతులు చేస్తున్న కష్టం.. అదే పంటలు చేతికొస్తున్న తరుణంలో వాటిల్లుతున్న నష్టం.. అన్నీ పరిశీలించి వారిని పూర్తిస్థాయిలో అదుకోవాలని, అప్పుల బారి నుండి బయట పడేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుపాను నేపథ్యంలో భారీ వర్షాలకు మండల కేంద్రమైన యడ్లపాడులో నీట మునిగిన పైర్లను ఆయన బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాపుకొచ్చిన మిర్చి పంట దెబ్బతిందని, మొక్కలకు ఉన్న కాయ మొత్తం తాలుగా మారే ప్రమాదముందని అన్నారు. రబీలో వేసిన శనగ, పొగాకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఈ పంటలన్నింటినీ ఈ-క్రాప్‌లో నమోదు చేసి బాధిత రైతులను గుర్తించాలని కోరారు. ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేస్తున్నట్లు ప్రభుత్వం, అధికారులు అర్భాటంగా ప్రకటిస్తున్నా చాలా మంది పొలాలను ఇప్పటికీ నమోదు చేయలేదని క్షేత్రస్థాయిలో రైతులు చెబుతున్నారని తెలిపారు. రియలెస్టేట్ ప్లాట్లతో వాగులను మళ్లించడం, రోడ్లు వేయడంతో నీరు పోయే మార్గం లేక పొలాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. ప్రభుత్వం మిర్చి ఎకరాకు రూ.6800 చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తోందని, అయితే అది విత్తనాల ఖర్చుకైనా సదిపోదని అన్నారు. సాగు ఖర్చులకు అనుగుణంగా దీన్ని పెంచాలని, మిర్చికి రూ.50 వేలు, మిగిలిన పంటలకు రూ.25 వేలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్న పంటలను రక్షించు కోవడానికి అవసరమైన సూచనలను రైతులకు వ్యవసాయ అధికారులు తెలపాలని, అవసరమైన మందులను రైతుభరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలకు, వేలిముద్ర వేయని రైతులకు వేయడానికి అవకాశం కల్పించాలన్నారు. మొన్నటి వరకూ నీటి ఎద్దడి నుండి పంటలను రక్షించు కోవడానికి నానా అగచాట్లు పడిన రైతులు ఇప్పుడు పంట చేతికొచ్చే తరుణంలో నీట మునిగిన పంటను కాపాడుకోవడానికి అవస్థ పడుతున్నారని, ఈ కష్టాలన్నింటినీ ప్రభుత్వం గుర్తించి దిగుబడుల ఆధారంగా బీమాను అమలు చేయాలని కోరారు.

ఏకమైన వాగులు.. దెబ్బతిన్న పంటలు..

మండలంలోని ప్రధాన వాగులైన ఉప్పవాగు, నక్క వాగు తుపాను నేపథ్యంలో పొంగిపొర్లాయి. రెండు వాగుల కలయికతో తిమ్మాపురం, దింతెనపాడు, జాలాది, గణేశు నివారిపాలెం, తుర్లపాడు గ్రామాల్లో పలు పంటలు నీట మునిగాయి. ఇదిలా ఉండగా పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి, ఆరు గ్రామాల్లో ట్రాన్స్‌ఫారాలు దెబ్బతిన్నాయి. ఉన్నవలో నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోగా యడ్లపాడులో ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. వంకాయలపాడు పీటర్ వద్ద యుకలిప్టస్ చెట్లు విద్యుత్ తీగలపై వాలాయి. బోయపాలెం నుంచి సంఘం గోపాలపురం వెళ్లే మార్గంలో భారీ చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిలినట్టు ఏఈ సాంబశివరావు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో పనరుద్ధరణకు 14 మంది సిబ్బంది పనులు చేస్తున్నారు.



నీరు పోవడానికి పొక్లెయిన్

ప్రజాశక్తి - అచ్చంపేట

మిచౌంగ్ తుపాను మిర్చి రైతులకు కన్నీళ్లను మిగిల్చాయి. మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మండలంలో మిర్చి కాయలున్న మొక్కలన్నీ నేలకొరిగాయి. సుమారు 2 వేల ఎకరాలకు పైగా మిరప పంట నేలకొరిగినట్లు తెలిసింది. మండల పరిధిలోని సంద్రతండాకు చెందిన లోక నాయక్ అనే కౌలురైతు మాట్లాడుతూ తాను సాగుచేసిన ఆరెకరాల పంట నీట మునిగిందని, తాను ఏడెకరాలు కౌలుకు తీసుకుని ఎకరాకు రూ.45 వేల చొప్పున కౌలు చెల్లించి సుమారు రూ.10 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టానని, ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉన్న సమయంలో ఉపద్రవం వచ్చిందని వాపోయారు. తన పొలానికి మూడు వైపులా రహదారి ఉండటంతో ఎగువ పొలాల నుండి వచ్చే నీరంతా తన పొలంలోనే నిలిచి పంట మునిగిపోయిందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా పక్కనే ఉన్న పొలం సాగవకపోవడంతో ఆ రైతును బతిమాలి పొక్లెయిన్‌తో రహదారిని పగలగొట్టి తన పొలంలోని నీటిని బయటకు పంపినట్లు వివరించారు. పొలంలో నీరింకా ఉందని, మొత్తం బయటకు వెళ్తే మినహా పడిపోయిన మొక్కలను లేపలేమని బాధిత కౌలు రైతు చెబుతున్నారు. నీట మునిగిన కాయలన్నీ తాలు కాయలుగా మారే ప్రమాదముందని ఆవేదనకు గురవుతున్నారు.

ప్రజాశక్తి - అమరావతి

వాగులు వంకలు కలసి పంట పొలాలపై ప్రవహించి పంటను పూర్తిగా దెబ్బతీసాయని టిడిపి రైతు విభాగం నాయకులు కె.వసంతరావు అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో నీట మునిగిన పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఎండ్రాయి, నరుకుళ్లపాడు, ఉంగుటూరు, ఊటుకూరు, బయ్యవరం ప్రాంతాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పత్తి పొలాల్లో ఒక్కో ఎకరంలో ఐదారు క్వింటాళ్ల పత్తి తీతకు సిద్ధంగా ఉన్న సమయంలో తుపాను పంటను నీట ముంచిందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పొలాలు నీట మునిగాయన్నారు. బాధిత రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



విరిగి పడిన అరటి చెట్లు

ప్రజాశక్తి-నకరికల్లు

తుపాను బాధిత రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు డిమాండ్ చేశారు. చేజర్లలోని దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, అరటి, మిర్చి పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. మండలంలో ఎక్కువగా కౌలురైతులున్నారని, నష్టపరిహారాన్ని వారికే దక్కేలా చూడాలని కోరారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తుపాను బాధిత మిర్చి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కంకణాలపల్లిలో మిర్చి పొలాలను సంఘం నాయకులు పరిశీలించారు. మహేష్ మాట్లాడుతూ పంట చేతికొచ్చే ప్రతిసారి ప్రకృతి కన్నెర్ర చేయటంతో రైతులు విలవిల్లాడుతున్నారని అన్నారు. మిర్చి, పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలు చేతికొచ్చే సమయంలో వచ్చిన తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే పంట నష్టం అంచనా వేయాలని కోరారు. పరిశీలనలో కౌలు రైతులు ఎం.వెంకటేశ్వరరావు, పి.వెంకటరావు, నరేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ముంపు బారిన పడిన శనగ, పత్తి, పొగాకు పొలాలను, పట్టణంలో లోతట్టు ప్రాంతాలను, పసుమర్రులో నీట మునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. 13వ వార్డులో పెంకుటిల్లు కూలిపోగా వారికి ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సత్వర సాయంగా రూ.10 వేలు ఇవ్వాలన్నారు. నీరు పోయే మార్గం లేకుండా వెల్లంపల్లి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసిన కారణంగా పదెకాల్లో ఐదారు అడుగుల నీరు నిలిచిందని, రైతులు పూర్తిగా నష్టపోయారని చెప్పారు. రైతులను ఆదుకోవడంతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యాసరాలను సరఫరా చేయాలని కోరారు. సత్వరమే వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, శనగ పంటలను మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు బుధవారం పరిశీలించారు. వనికుంటలో నీటి మునిగిన శనగ పైరును తహసిల్దార్ ఏవీ సుధాకర్ పరిశీలించారు. దెబ్బతిన్న పంటలపై నష్ట అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏవో తెలిపారు.

ప్రభుత్వం తక్షణం స్పందించి రైతుల్ని ఆదుకోవాలి

నీటమునిగిన పంటలను పరిశీలించిన సిపిఎం, రైతు, కౌలురైతు, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

తుపాను కారణంగా నష్టపోయిన వట్టిచెరుకూరు మండలంలోని మిర్చి, పత్తి, మినుము, కూరగాయల పొలాలను బుధవారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకుల బృందం పరిశీలించారు. పంట చేతికి వచ్చే సమయానికి తుపాను కారణంగా రైతాంగం తీవ్రమైనటువంటి నష్టం చేకూరిందని రైతులు వాపోయారు. మిర్చి పంటకు ఎకరాకు ఇప్పటికే రూ.1.30 లక్షలు ఖర్చు చేశామని, మినుము, టొమాటో వంటి పంటలకు రూ.60 వేల నుండి రూ.1లక్ష వరకు కౌలు కాకుండా ఖర్చుపెట్టామని రైతులు వివరించారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం పొలాలలోకి వచ్చి ఈ క్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా పొలం ఎవరైతే వేస్తారో కౌలు రైతులు, పంటెసినటువంటి వారిని అవకతవకలు లేకుండా నమోదు చేయించుకొని నిజమైనటువంటి నష్టపోయిన టువంటి రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొలాలు చేతికొచ్చే సమయానికి ప్రకృతి విలయ తండడం వలన నష్టపోయినటువంటి ప్రతి ఒక్క ఎకరాకు 25 వేల రూపాయల తక్కువ లేకుండా నష్టపరిహారాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని అనంతవరప్పాడు, లేమల్లెపాడు గ్రామాలలో పొలాలను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి లక్ష్మణరావు, జిల్లా నాయకులు వై కృష్ణ కాంత్, ఎం కిరణ్, సమీర్, భగత్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండలంలో వివిధ గ్రామాలలో నేలకు ఒరిగిన మిర్చి, మినుము, వరిపొలాలను సిపిఎం బృందం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ మాట్లాడుతూ మిర్చి, మినుము , వరి పూర్తిగా నీట మునిగాయని, మిర్చి ఉరకెత్తి పోయిందని, తక్షణం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఇప్పటివరకు అయిన ఖర్చులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం నాయకులు సంకురి నిలాంబరం, సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ యన్ వెంకటేశ్వరావు బి సాంబయ్య ముసలయ్య రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు మండలంలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల నీట మునిగి దెబ్బతిన్న మిర్చి, పొగాకు, శనగ, పంటలను బుధవారం రైతులతో కలిసి నీట మునిగిన పంట పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. తుఫాను కారణంగా ఈ ప్రాంతంలో వేసిన అన్ని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పంటలను వ్యవసాయ అధికారులు వెంటనే పరిశీలించి నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించి రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. మిర్చి పంటకు ఎకరానికి లక్ష రూపాయల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని, ప్రస్తుతం ఒక రూపాయి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని తెలిపారు, పొగాకు పంటకు కూడా ఎకరానికి 50వేల వరకు పెట్టుబడి పెట్టారని, శనగ, కంది పంటలకు 30 వేల వరకు ఎకరానికి పెట్టుబడి పెట్టారని ఏ పంటకు కూడా పెట్టిన పెట్టుబడి తిరిగిరాని పరిస్థితి ఉందని తెలిపారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. రైతులను ఆదుకునేందుకు తిరిగి పంటలను సాగు చేసుకునేందుకు విత్తనాలు, ఎరువులను ఉచితంగా రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు, నల్లమడ వాగు, మేకల వాగు, ఇతర కాలువల్లో తూటి కాడ, అడవి తుమ్మ, వంటివి తొలగించి పూడికతీత పనులను చేపట్టాలని, ఇలా భారీ వర్షాలు కురవడం వల్ల పారుదల సరిగ్గా లేక కాలువలు, వాగులు ఎగదన్ని పంట పొలాలు మునిగిపోతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు చుక్కా యానాదులు, అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కుర్రా హరిబాబు, రైతులు బండి భోగేశ్వరరావ్, పానుబోతుల ప్రసాద్, జాజి ఆనందరావు, గాలి మేలు శ్రీనివాసరావు, నన్నపనేని పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



వట్టిచెరుకూరులో సిపిఎం బృందం పరిశీలన



కుంచనపల్లిలో



పెదకాకానిలో



మంగళగిరిలో



చేబ్రోలులో

తాడేపల్లి రూరల్ మండలం కుంచనపల్లిలో







ప్రజాశక్తి -మంగళగిరి

మూడు రోజులుగా తుపాను వలన కురిసిన వర్షాలు వలన ఉపాధి కోల్పోయిన బాధితులకు వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని, బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాల చెరువులో వర్షాలు వల్ల ముంపు గురైన ప్రాంతాలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ వెంటనే నీళ్లు మళ్లించే చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధి కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం, బియ్యం పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, పట్టణ నాయకులు టి శ్రీరాములు, అన్వర్ ఖాన్, సిఐటియు నాయకులు జె నవీన్ ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మీచౌంగ్ కారణంగా గత రెండు రోజులుగా అకాల వర్షాలతో, ఈదురు గాలులతో పంట నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి లో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ తుఫాను బీభత్సంతో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు తాడేపల్లి మండలంలో వివిధ గ్రామాలలో వరి, అరటి, కంద, ఆకుకూరలు, పూల తోటలు నీట మునిగి రైతులు నష్టపోయారని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి రైతులను, నష్టపోయిన కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే సహాయ చర్యలు చేపట్టి, ఆదుకోవాలని అన్నారు. ఒక్కో ఎకరానికి 50 వేల నుండి లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టి , పంటల నష్టపోయే పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన చెందారు. అనంతరం కుంచనపల్లి రైతు భరోసా కేంద్రం వ్యవసాయ అధికారిని వల్లభనేని శిరీషాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కుంచనపల్లి గ్రామంలో ఆకుకూరలు రైతులు సుమారు 300 మందికి పైగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రైతులకు పరిహారం అందించాలని ఆయన కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి నాగేశ్వరరావు, బొడ్డు మహేంద్ర తదితరు లున్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు మండలంలో తుపాను వల్ల నష్టపోయిన పంటలను సిపిఎం నాయకులు పరిశీలించారు. రైతులను అడిగి పంట న ష్టం వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం చేబ్రోలు శాఖ కార్యదర్శి పల్లా ఆదిశేషు, నాయకులు సిహెచ్ హనుమంతరావు, పవన్ రెడ్డి, పూజల చౌడయ్య. తదితరులు పాల్గొన్నారు.



మిర్చి పొలాలను పరిశీలించిన జెడ్పీటీసీ సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు

తుపాను కారణంగా గుంటూరు రూరల్ మండలం, దాసుపాలెంలో నీట మునిగిన మిరప పంటలను జెడ్పీటిసి తుమ్మల సుబ్బారావు పరిశీలించారు. అనంతరం దాసుపాలెం, చిన్నపలకలూరు గ్రామాల మధ్య అధిక వర్షాలకు కొండవీడు వాగు తీవ్రంగా ప్రవహించటం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు జెడ్పీటిసి దృష్టికి తేవటంతో సుబ్బారావు వంతెనను పరిశీలించారు. వంతెన కింద చెత్తా చెదారం ఇరుక్కుపోవటంతో వాగు వంతెన పైనుండి ప్రవహిస్తుందని గమనించి, తక్షణమే పూడిక తొలగించాలని అధికారులకు తెలిపారు.జెడ్పీటిసి వెంట మాజీ వైస్ ఎంపిపి దాసరి నాగరాజు, చిన్నపలకలూరు మాజీ సర్పంచ్ తోట నాగేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ తంగిళ్ల నాగేశ్వరరావు, కటారి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రామయ్య కాలనీ, ఇస్లాంపేట, పుష్కర కాలనీ ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరాయి. రోడ్డు ఆనవాళ్లు లేకుండా నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. పుష్కర కాలనీ కూడా ఇళ్ల ముందు వర్షం నీరు పెద్దఎత్తున నిలిచి పోయింది. దీంతో ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. ఇళ్ల ముందు నీరు నిలబడిన ప్రాంతాలను సిపిఎం నాయ కులు బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు సందర్శించారు. రామయ్య కాలనీలో పెద్దఎత్తున నిలబడిన వర్షం నీటిని బయటకు తరలించాలని మున్సిపల్ అధికారులకు సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు వెంటనే మోటారు ఇంజన్లను ఏర్పాటు చేసి నీటిని బయటకు తోడే ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ వర్షాల వల్ల గత మూడు రోజుల నుంచి పనులు కోల్పోయిన పేదలకు నిత్యావసరాలు అందజేయాలని కోరారు. టిడిపి నాయకులు కూడా ఆయా ప్రాంతాలను పరిశీలించి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.



స్లాంపేట, రామయ్యకాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

నిండా మునిగిన రైతు

ప్రజాశక్తి-తాడేపల్లి



మిచౌంగ్ తుపాన్ తాడేపల్లి, రాజధాని రైతులను నిండా ముంచింది. సుమారు రూ.5 కోట్ల పంట నష్టం సంభవించిందని రైతులు వాపోతున్నారు. అరటి పంటకు తీవ్ర నష్టం జరిగింది. అరటి గెలలు కాసిన చెట్టు నేలవాలాయి. సుమారు రెండు వేల ఎకరాల్లో అరటి పంటకు రూ.కోటి పైగా నష్టం వాటిల్లింది. ఎకరానికి రూ.30 వేల నుంచి 60 వేల వరకు పంట నష్టపోయామని రైతులు చెబుతున్నారు. కొత్తిమీర, ఆకుకూరల పంటలు నీళ్లల్లో నానుతున్నాయి. బుధవారం వర్షం కొంత మేర తెరిపించినా పొలాల్లో నీళ్లు అలాగే ఉన్నాయి. కొండవీటి వాగులో నీరు ఎగదన్ని పొలాలను ముంచెత్తిందని రైతులు చెబుతున్నారు. వరి పైరుకు కూడా ఎకరానికి రూ.20 వేలు నుంచి 30 వేల వరకు నష్టం సంభవించింది. ఈ ఏడాది 300 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికీ కొంత మేరకైనా తమకు ప్రభుత్వం కొనుగోలు చేస్తే గట్టెక్కుతామనే అభిప్రాయంతో రైతులు ఉన్నారు. తడిసిన ధాన్యంతో పాటు పంట నష్టపోయిన వాణిజ్య పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తేనే రైతులు మనుగడ సాధ్యమవుతుందని రైతు సంఘం నాయకుల మీద వాపోయారు. బుధవారం రైతు సంఘం నాయకులు ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో తుపాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఉల్లి, పూల తోటలకు కూడా బాగా నష్టం జరిగిందని రైతులు నాయకుల ముందు వాపోయారు. ఉల్లి పొలంలో నీరు నిలబడటం వల్ల పాయ కుళ్లిపోయే స్థితికి చేరుకుంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దొండ తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. పొలాలను సందర్శించిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, రాజధాని డివిజన్ అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు వీరాస్వామి, టి.బక్కిరెడ్డి తదితరులు ఉన్నారు.

33 వేల ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి - చేబ్రోలు : మండల వ్యాప్తంగా దాదాపు 33 వేల ఎకరాల్లో చేతికి వచ్చిన పంట నష్టపోయారు. .కోతలు కోసి అరబెట్టిన పనులు నీళ్లపాలవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటమునిగిన మినపంపంటలు, ఒరిగిన మిరప మొక్కలు, నీరు అధికంగా నిలవడంతో మొక్క వేరు కుదురు కదిలి ఉరకేత్తుతున్న పరిస్థితుల్లో రైతులు, కౌలు రైతులు దిక్కుతోచక ఉన్నారు. పాత రెడ్డిపాలెం గొడవర్రు గుండవరం నారాకోడూరు సుద్ధపల్లి శలపాడు వీరనాయకులపాలెం గ్రామాలలో వేసిన మిరప పంట 1000 ఎకరాల పొలాల్లో పూర్తిగా పైరు నీటమునిగాయని రైతులు తెలిపారు. దాదాపు 12 వేల ఎకరాల వరి కోతలకు సిద్ధంగా ఉన్నది. తుపాను తీవ్రతతో మొత్తం నేలకి వరగడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: మంత్రి అంబటి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తుఫాను కారణంగా పంట దెబ్బతిన్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్రజల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలంలోని నందిగామలో తుపాను వరద ముంపునకు గురై దెబ్బతిన్న మిర్చి పొలాలను మంత్రి బుధవారం పరిశీలించారు.రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తుఫాను వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో 9,190 హెక్టార్లు సాగు విస్తీర్ణం ఉండగా 3,432 హెక్టార్లు ఈ ఏడాది సాగులో ఉందని, వీటిలో 480 హెక్టార్లు మిరప,శనగ పంటలు వరద ముంపునకు గురికాగా 55 హెక్టార్ల వరి ఇతర పంటలు తుఫాను గాలులకు నేలకొరిగి పంట నష్టం జరిగిందని మంత్రి కి ఇన్చార్జి ఏడిఎ శ్రీధర్ రెడ్డి వివరించారు. పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనా వేయాలని వ్యవసాయ అధికారులను అంబటి రాంబాబు ఆదేశించారు.రైతులకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం నిబంధనల ప్రకారం అందించేలా కృషి చేస్తామన్నారు. వరద ముంపునకు ఇతర విధంగా నష్టపోయిన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి తాత్కాలిక ఉపశమన మార్గాలను, నష్ట నివారణకు చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు రాయపాటి పురుషోత్తం రావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కరరెడ్డి , తహశీల్దార్ సురేష్ నాయక్ వైసిపి నేతలు కట్టా సాంబయ్య, ఆళ్ల జగ్గయ్య పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మిస్తాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భారీ వర్షాలతో సత్తెనపల్లిలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి.లోతట్టు ప్రాంతాలైన మాస్టిన్ పేట, సుందరయ్య కాలనీ, నాగన్న కుంటలలో వర్షపు నీరు వచ్చి చేరింది.దీంతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్టేషన్ రోడ్డులోని దాసరి ఉమా మహేశ్వరరావు ఇంటిముందు, కస్తూర్బా బాలికల పాఠశాలలు ఆవరణలో వర్షపు నీరు బారీగా వచ్చి చేరింది.దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో పలు ప్రాంతాలలో వర్షపనీరు వచ్చి చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆయా ప్రాంతాలను సందర్శించి ప్రొక్కులైనరు సహాయంతో వర్షపు నీరుని బయటకు పోయేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల కమిషనర్ కు అభినందనలు తెలిపారు. పట్టణంలోని 19, 20,21 వార్డులకు సంబంధించిన శ్మశానానికి వెళ్లే మార్గంలో వాగు పొంగి పొర్లింది. దీంతో సుందరయ్య కాలనీ, కొత్తపేటలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ కె షమ్మి లు వాగు ప్రదేశాన్ని పరిశీలించారు. వాగు పొంగి పొంగి పొర్లిన ప్రతిసారి తాము పడుతున్న ఇబ్బందులను మంత్రికి ప్రజలు వివరించారు. ఈ వాగుపై వంతెన నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం అవుతుందని వారు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వీలైనంత త్వరలో ఈ వాగు పై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



సత్తెనపల్లి మండలం నందిగామలో దెబ్బతిన్న మిర్చి పంటలను పరిశీలిస్తున్న అంబటి రాంబాబు



నీట మునిగిన కాలనీలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గోళ్ళపాడు ఎస్టీ కాలనీలోకి,ప్రక్కనే ఉన్న కెజిబివి పాఠశాలలో కి భారీగా వరదనీరు చేరింది.ఈ సందర్భంగా మండల తహశీల్దార్ భవానీశంకర్,ఎంపిడివో పుట్టారెడ్డి, గోళ్ళపాడు సర్పంచ్ గోపు అప్పమ్మ స్పందించి కాలనీ వాసులకు దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో పునరావాసం కల్పించారు.వరద నీరు బయటకు వెళ్ళేందుకు సహాయక చర్యలు చేపట్టారు.మండలంలో ఇటీవల వేసిన మొక్కజొన్న,శనగపంటలు వరద ధాటికి నీటమునగడంతో రైతులు లబోదిబో మంటున్నారు.

ఈ సందర్భంగా వరద తాకిడికి నీట మునిగిన ప్రాంతాలను మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ కన్నా లక్ష్మీ నారాయణ,జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పరిశీలించి కాలనీవాసులను,పాఠశాల విద్యార్థినీలను పరామర్శించారు.




వాగు కింద పగలగొట్టిన గునలు, ధర్నా చేస్తున్న రైతులు

రహదారిపై రైతుల ధర్నా

ప్రజాశక్తి-నకరికల్లు

డొంక రోడ్‌లో వాగు కింద వేసిన గునలను పగలకొట్టి పొలాలకు వెళ్లే దారి లేకుండా చేసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొంతమంది మహిళలు,రైతులు త్రిపురపురం వద్ద గల అద్దంకి - నార్కట్ పల్లి రాష్ట్ర రహదారి పె బుధవారం ధర్నా నిర్వహించారు. రైతులు పోలీసులకు, తెలిపిన వివ రాల ప్రకారం గ్రామానికి చెందిన రాగి శ్రీను , గడి బోయేన, అదెమ్మ లు డొంక రోడ్ లోని వాగు లో వేసిన గున లను బుధవారం పొక్లెయిన్‌తో పగలగొట్టారు. ఈ విషయమై అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని చెప్పారు. గతంలో చాలాసార్లు కలెక్టర్ స్పందనలో అర్జీలు అందజేసిన సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించలేదని, ఏమి చేయాలో అర్థం కాక రోడ్డెక్కినట్టు బాధితులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ బాలక్రిష్ణ సంఘటన స్థలాన్ని చేరుకొని రైతులతో మాట్లాడి ట్రాఫి క్ ను క్రమబద్ధీకరించారు. వెంటనే సమస్యను ఫోన్ ద్వారా తహశీల్దార్ నగేష్ దృష్టికి తీసుకెళ్లగా త్రిపురాపురం వీఆర్వో, మార్కును, ఆర్ ఐ యువరాజును పంపి సమస్యను పరిష్కరించారు.



రెంటపాళ్ళలో నష్టపోయిన మిర్చి పొలాలను పరిశీలిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

పంట రుణాలు మాఫీ చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఈ ఏడాదిలో రెండు సార్లు వచ్చిన తుపాన్లకు పంటలకు తీవ్రనష్టం వాటిల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులు తీసుకున్న పంట ఋణాలు మాఫీ చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ లో వర్షాలకు దెబ్బతిన్న,మిర్చి మాగాణి, మొక్కజొన్న పంటలను కన్నా లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. పంటనష్ట పోయిన రైతులు నంబ్బుల సైదయ్య, షేక్ సాంబయ్య మిర్చి పంటలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి నష్టం పరిహారం రైతులకు అందే వరకు రైతుల పక్షాన టీడీపీ పోరాటం చేస్తుందని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నష్టపోయిన రైతులకు ఉచితంగా ఎరువులు పురుగు మందులు ఇవ్వాలని , పార్టీ రహితంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నష్టపరిహారమివ్వండి



ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రత్తి, మిరప ఇతర పంటలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్తిమళ్ల రమేష్ కోరారు. బుధవారం పెదకూరపాడు మండలంలోని పాటిబండ్ల, పరస, ఖమ్మంపాడు వద్ద మునిగిన పంట పొలాలను పరిశీలించారు.

ప్రజాశక్తి -కారంపూడి

మిచౌంగ్ తుఫాన్ కారణంగా అకాల వర్షాల వలన రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్ట పరిహారం అందించాలి అని టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలం లోని ఒప్పిచర్లలో పంట పొలాలను సందర్శించారు.

నీటమునిగిన పంటల పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి

మిచాంగ్ తుపాను ప్రభావం పెదకూరపాడు నియోజకవర్గంపై ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. తుపాను ప్రభావంతో అమరావతి మండలంలో నీట మునిగిన పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. పంట నష్టం అంచనాపై అధికారులకు పలు సూచనలు చేశారు. నరుకుళ్లపాడు, ఎండ్రాయి, మునుగోడు గ్రామల్లో పర్యటించిన ఎమ్మెల్యే నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులను పరామర్శించారు. పంటలు ఇంకా నీటిలోనే ఉన్నాయని.. వరద తగ్గగానే అధికారులు పంట నష్టంపై అంచనాలు సిద్ధం చేస్తారని తెలిపారు. అమరావతి మండలంతో పాటు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పంట నష్టం అంచనాలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించినట్టు చెప్పారు. ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి, మిరపతో పాటు కంది, పెసర, మినప పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లినట్టు చెప్పారు. ప్రత్యామ్నాయ పంటలుగా శనగ వేసే రైతులకు వెంటనే విత్తనాలు అందించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. పంట నష్టంతో పాటు మేడిగడ్డ వాగు పూడికతీతపై సీఎం వైఎస్ జగన్ దష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ శ్రీ, ఏవో అహ్మద్ పాల్గొన్నారు.



నీట మునిగిన పంటలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

విలవిల్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి -కారంపూడి

మండలంలోని పలు గ్రామాల్లో వరి, మిరప, కంది, బుడ్డ శనగ పలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కోతకు వచ్చిన వరి పంట పలుచోట్ల పూర్తిగా నేలమట్టం అయ్యాయి. పూత దశ, కాయ దశలో ఉన్న మిరప పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. చేతికి వచ్చిన పంట నీటిపాలయ్యేసరికి రైతులు విలపిస్తున్నారు. మిర్చి పంటకు ఒక్కో ఎకరానికి సుమారు రూ.75,000 పెట్టుబడి పెట్టామని, చేతికి వచ్చిన పంట నీటిపాలైందని వాపోతున్నారు. పంట చేతికి వచ్చే స్థితి లేక చేసిన అప్పు తీర్చే అవకాశం లేక ఏం చేయాలని మొర పెట్టుకుంటున్నారు. ఆరుగాలం కష్టించి నీటి మునిగిన పంటను చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మమ్ములను ఆదుకోవాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు.



పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

ప్రజాశక్తి - అమరావతి



మండల కేంద్రం లోని బండచేను, కాలచక్ర కాలనీ నీటి ప్రవా హంలో మునిగి పోవడంతో స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో పలోటి కాలే జీలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం ఆర్డిఓ రాజ కుమారి పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. 52 గుడిసెలలో 156 మంది స్త్రీ,పురుషులను మరో ఇద్దరూ గర్భిణుల పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహశీల్దార్ విజయ శ్రీ తెలిపారు. స్థానిక ఎంపీటీసీ ఆలా వెంకట రాజ్యలక్ష్మి వారికి భోజన సౌకర్యాలు కల్పించారు. వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని, మరో రెండు రోజులపాటు ఇక్కడే ఉండాలని సూచించారు.

పెద్దమద్దూరు వాగు పరిశీలన

మండల పరిధిలోని పెద్దమద్దూరు వాగును ఆర్డీవో రాజకుమార్ పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. పూర్తిగా వాగు పరివాహక ప్రాంతమంతా నీటిమయమైందని, ప్రవాహం వైపు ఎవరు ఇటువైపు రాకుండా వీఆర్వోలను పోలీసులను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతంలోని పంటల నష్టాన్ని అంచనా వేయాలని అన్నారు. కలెక్టర్ కు నివేదిక పంపిస్తామని చెప్పారు.

అధిక వర్షాల నుండి పంటను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

అధిక వర్షాల నుండి ఉద్యాన పంటలలో జాగ్రత్త చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలనీ మండల ఉద్యానశాఖ అధికారిణి సి.హెచ్ జననీ అన్నారు. మండలంలోని దమ్మాలపాడులో మిర్చి పంటలను బుధవారం పరిశీలించిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికంగా వర్షాలు కురవడంవలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడి మిరప,పసుపు,కూరగాయ,అరటి పంటలలో నీళ్ళు నిలబడి ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందన్నారు.ఈ పరిస్థితుల్లో అధిక తేమ వలన వేర్ల ద్వారా మొక్క అవసరమైన పోషకాలను తీసుకోలేక మొక్కలు ఉరకెత్తి అవకాశం ఉందన్నారు.

రెండ్రోజుల తర్వాత పంటనష్టం అంచనా వేస్తాం

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి - తెనాలి, పెదకాకానిరూరల్, పొన్నూరు

తుపాన్ కారణంగా పెదకాకాని మండలం ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం, తెనాలి మండలం లోని హాఫ్ పేట, ఈమని గ్రామాలలో నీట మునిగిన పంటలను బుధవారం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, పొన్నూరు శాసన సభ్యులు కిలారీ వెంకట రోశయ్య తెనాలి సబ్-కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టంపై ఎన్యూమేరేషన్ చేపట్టడం జరుగుతుందని, ఆ మేరకు నష్ట పరిహారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వర్షం వల్ల పంట పోలాలలో వున్న నీటిని బయటికి పంపి పంటలను సాధ్యమైనంత మేర రక్షించుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు రైతులకు వివరించారు. అనంతరం మీడియా తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను తుఫాన్ వలన జిల్లాలో పొన్నూరు, తెనాలి నియోజక వర్గాలలో పర్యటించి దెబ్బతిన్న వరి, మినుము, అరటి పంటలను వ్యవసాయ, ఉద్యాన శాఖ, నీటి పారుదల శాఖ అధికారులతో పరిశీలించడం జరిగిందని తెలిపారు. దుగ్గిరాల, తెనాలి, మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు మండలాలలో దాదాపు 150 మి.మీ వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాలలో 200 మి.మీ కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైందని, వరుసగా 2 రోజుల్లో 36 గంటల్లో ఇంత ఎక్కువుగా వర్షపాతం నమోదు అవుటంతో వరి, మినుము, అరటి చేలల్లో అధికంగా నీళ్ల నిలవ వున్నాయన్నారు. నీళ్ల బయటకి పంపడానికి రైతులతో మాట్లాడి ఎక్కడికక్కడ పరిష్కారం కనుగొని నీళ్ళను బయటికి పంపించే కార్యక్రమాలు చేయమని అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. స్వయంగా వ్యవసాయ, ఉద్యాన శాఖ, నీటి పారుదల శాఖ అధికారులతో పరిశీలించడం జరిగిందని, పొలాలలో నిలిచిన నీటిని ఎంత డబ్బు ఖర్చు అయిన బయటికి పంపించేందుకు ఇరిగేషన్ అధికారులు పరశీలిస్తున్నారన్నారు. నీటిని ఎంత త్వరగా బయటికి పంపించగలిగితే అంత మంచిదని, ఇప్పటికే డ్రయిన్స్ పొంగి పొర్లుతున్నాయని ఎంత తొందరగా నీళ్ళను బయటికి పంపితే పంటలను రక్షించగలుగుతామన్నారు. రైతులు, కౌలు రైతులకు వర్షాల వల్ల చాలా ఇబ్బందికర పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి కలెక్టర్లతో బుధవారం సమీక్ష నిర్వహించే సమయంలో జరుగుతున్న నష్టాన్ని వివరించే ప్రయత్నం చేస్తామని, రెండు రోజుల తరువాత పంట నష్టంపై అవగాహన వస్తుందని దాని పై గ్రామాలలో పంట నష్టం పై సర్వే చేసి నష్ట పరిహారానికి రిపోర్టు ప్రభుత్వానికి అందజేయటం జరుగుతుందని తెలిపారు. పంట పొలాల పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ అధికారి శ్రీకర్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రవీంద్ర బాబు, నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీరు ఉమా మహేశ్వర రావు, పిడి డ్వామా వెంకట శివ రామిరెడ్డి, మంగళగిరి తహ శీల్దార్ మల్లేశ్వరి, వ్యవసాయ మండల అధికారులు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొన్నూరు నియోజకవర్గంలో నేల వాలిన వరి పొలం







పొన్నూరు నియోజకవర్గంలో నేలవాలిన వరి పరిశీలన, తెనాలి నియోజకవర్గంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



ముంపు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీలో మిచౌంగ్ తుఫాను తాకిడికి ముంపు గురైన ప్రాంతాన్ని బుధవారం నగర కమిషనర్ వి నిర్మల్ కుమార్ సందర్శించారు. నగరంలోని వర్షపు నీరు, మరుగు నీరు బయటకు వెళ్లే ప్రధాన డ్రైన్ ను ఆయన పరిశీలించారు. ముంపు గురైన ప్రాంత ప్రజల కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముంపు గురైన వారిని పునరావాసాలకు తరలించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఏవిధమైన ఇబ్బందులు పడకుండా సహాయ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టుటకు పర్యవేక్షణ అధికారిగా పి శ్రీనివాసరావు (సెల్ నెంబర్: 89770 11901) ను నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు ఉన్నవారు వెంటనే పర్యవేక్షణ అధికారి హెల్ప్ లైన్ నెంబర్ గాని, సచివాలయం సిబ్బందికి, వాలంటీరీస్ కు సమాచారం అందించాలన్నారు. అడిషనల్ కమిషనర్ హేమమాలిని, సెక్రటరీ పి శ్రీనివాసరావు, డిఈ శ్యామల కృష్ణారెడ్డి కమిషనర్ వెంట ఉన్న వారిలో ఉన్నారు.



ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనాలి

కొల్లిపర, తెనాలి మండలాల్లో పర్యటించిన నాదెండ్ల, ఆలపాటి

ప్రజాశక్తి-కొల్లిపర, తెనాలి రూరల్

ప్రతి గింజ రైతు నుండి ప్రభుత్వం కొనుగోలు చేయాలని, తుపాను నష్టం అంచనాలకు అందడ లేదని జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ అన్నారు బుధవారం మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ తెనాలి ఇంచార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో కలిసి కొల్లిపర, తెనాలి మండలంలోని పలు గ్రామాలను పరిశీలించారు. బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామాల్లో పర్యటించి తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వలన నేత మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం అంచనాలను అడిగి తెలుసుకున్నారు. బుర్రిపాలెం రైతులు శ్రీనివాస్, జేమ్స్, చందు సోమయ్య చక్రాయపాలెం రైతు గోన శ్రీనివాసరావులు, రెడ్రౌతు జగన్మోహన్ పంట నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణ సాయం కింద ప్రభుత్వము నష్టపోయిన ప్రతి రైతుకు 20వేలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు రైతు కుటుంబాన్ని ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి బటన్ నొక్కాలని డిమాండ్ చేశారు తెదేప నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతులకు జరిగిన నష్టాన్ని లెక్క తేల్చలేనటువంటి దెబ్బ అని ప్రభుత్వము మురుగు కాలువలు బాగు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని కావున ప్రభుత్వ బాధ్యత వహించాలని ఆయన కోరారు.

డంపింగ్ యార్డ్ అలంకారానికేనా?

హాఫ్ పేటలో చెత్త డంపింగ్ పై ఆగ్రహించిన కలెక్టర్

ప్రజాశక్తి-తెనాలి

డంపింగ్ యార్డ్ ఉండగా చెత్తను కాలువల వెంట ఎందుకు వేస్తున్నారు?. అలంకారం కోసం డంపింగ్ యార్డ్ నిర్మించారా? కార్యదర్శి చెత్త సేకరణను పరిశీలించలేకపోతున్నారా అంటూ జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూరల్ గ్రామం హాఫ్ పేటలో పర్యటించిన ఆయన చిన్న మురుగు కాలువ వంతెన వద్దకు రాగానే గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. మురుగు కాలువలో పారుదల నిలిచిపోవడంపై వారు ఆయనకు ఫిర్యాదు చేయడంతో పాటు కాలువపై ఉన్న వంతెన కూడా దాదాపు 80 ఏళ్ల క్రితం నిర్మించినదని, కూలేందుకు సిద్ధంగా ఉందని ఆయనకు వివరించారు. అదే సమయంలో కాలువ ఒడ్డున చెత్త వేయడం, పక్కనే డంపింగ్ యార్డ్ ను గమనించిన కలెక్టర్ పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఉండగా చెత్తను కాలువ వడ్డున ఎందుకు వేస్తున్నారంటూ ప్రశ్నించారు. ఆ సమయంలో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో ఎన్ఆర్ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ తో మాట్లాడారు. తక్షణమే పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. వంతెన పరిస్థితి పై డ్రైనేజ్, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డ్రైనేజీ అనిల్ కుమార్, ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రతాప్ రెడ్డి, ఏ డి ఏ ఎన్ ఉషారాణి తదితరులు ఉన్నారు.

పనులు కల్పించాలని ఎమ్మెల్యేకు కూలీల వినతి

ప్రజాశక్తి- తెనాలి

పని కల్పించాలని ఉపాధి హామీ పథకంలోని కూలీలకు ఎమ్మెల్యేను కోరారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పొలాలను పరిశీలించేందుకు కాజీపేట, కొలకలూరు, హాఫ్ పేట గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యటించారు. వాస్తవానికి జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతానికి వస్తున్నట్లు తెలుసుకున్న ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున కాజీపేట శివారులో చెరువు వద్ద గుమికూడారు. అయితే దీనిపై కలెక్టర్ కు ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆయన కాన్వాయ్ ఆగలేదు. దీంతో వారంతా నిరాశకు గురై వెనుదిరిగారు. కొద్ది నిమిషాల్లో వ్యవధిలోనే ఎమ్మెల్యే ఆ ప్రాంతానికి చేరుకోవడంతో వారు ఎమ్మెల్యేను కలిసి తామంతా ఉపాధి కూలీలమని పని కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన పంట పొలాలలో నిలిచిపోయిన నీటిని కాలువలలోకి పెట్టేందుకు, అలాగే కాలువలలో పూడికలు తీయించేందుకు ఉపాధి కూలీలను ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను ప్రభావం బాధాకరమన్నారు. దాదాపు 13 వేల ఎకరాలలో వరి, 215 ఎకరాలలో మినుము దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాలు, వారు సాగు చేస్తున్న పంటల వివరాలు ఉన్నాయని వాటి ద్వారా సర్వే నిర్వహించి పంట నష్టం అంచనాలు జరుగుతాయన్నారు. అలాగే కాలువలలో నిలిచిపోయిన గుర్రపు డెక్క, తూటికాడను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ డి చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ సిహెచ్ శ్రీనివాసరావు, ఇన్చార్జి ఎంపీడీవో ప్రతాపరెడ్డి తాసిల్దార్ కే రవిబాబు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కాచి చల్లార్చిన నీరు తాగండి : డాక్టర్ అనూష



ప్రజాశక్తి -మంగళగిరి : తుపాను భారీ వర్షాల కారణంగా నీరు కలుషితం అయ్యి పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ అనూష తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల వాంతులు, విరోచనాలు టైఫాయిడ్ జ్వరం వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చల్లని గాలులు చెవుల్లోకి వెళ్ళటం వల్ల గొంతు నొప్పి, దగ్గు, జలుబు వచ్చే అవకాశం ఉందన్నారు. చల్లగాలు నుండి రక్షణ పొందటానికి చెవులకు మఫ్లర్లు ధరించాలన్నారు. దోమలు కూడా పెరిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. చలికాలంతోపాటు తుపాను ఈదురు గాలకు చలి మరింత ఎక్కువగా ఉంటుందని వృద్ధులు, పిల్లలు, మహిళలు చలి నుండి రక్షణ పొందటానికి స్వెటర్లు, వెచ్చని ఉన్ని దుస్తులు ధరించాలన్నారు. వ్యాధులు సోకినవారు సమీపంలోని హెల్త్ సెంటర్లను సందర్శించి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వైద్య సేవలను పొందాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

తుపాన్ వలన కురిసిన వర్షాల వలన ఉపాధి కోల్పోయిన రత్నాల చెరువు చెందిన బాధిత కుటుంబాలకు బుధవారం టిడిపి ఆధ్వర్యంలో పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, కే అంకమ్మరావు, పి మహేష్, దామర్ల రాజు, మునగపాటి వెంకటేశ్వరరావు, టి జానకి దేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని, పూడికను తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

మిచౌంగ్ తుపాను తీరం దాటినందున తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జిఎంసి నుండి తీసుకోవాల్సిన చర్యలు వెంటనే చేపట్టాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం తుపాను అనంతరం నగరంలో తాగునీటి సరఫరా, రోడ్ల మరమత్తులు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని బెయిల్ అవుట్ చేయడం తదితర అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుపాను వల్ల భారీ వర్షాలు పడ్డాయని, అధికారులంతా తమ పరిధిలోని ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను తీసుకురావడంపై దష్టిపెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా లోతట్టు ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ పనులు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. డ్రైన్లలో అడ్డుగా ఉన్న పూడిక తొలగించామని, పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో సచివాలయాల వారిగా పూడిక తీయించాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని వెంటనే బెయిల్ అవుట్ చేయడానికి ఏఈల వారీగా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైన్ల మీద ఉన్న ఆక్రమణలను కూడా రానున్న వారం రోజుల్లో తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కష్ణానదికి తుపాను వర్షాల వలన నీరు కొంత బురదతో వస్తుందని, నగర్ ప్రజలు త్రాగునీటిని కాచి వడకట్టుకొని త్రాగాలని తెలిపారు. నగరంలో ఇంకా ఎక్కడైనా నీరు నిలిచి ప్రజా జీవననానికి ఆటంకాలు, చెట్లు పడిపోయి ఉంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 కి కాల్ చేస్తే వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : జిల్లా వైద్యాధికారి

అర్బన్ పిహెచ్‌సీల్లో పోస్టులకు ప్రొవిజినల్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ

పజాశక్తి-గుంటూరు

అర్బన్ పిహెచ్‌సిలలో వివిధ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజినల్ జాబితా విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్ గ్రేడ్-2, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పోస్టులు ఒప్పంద ప్రాతిపదికన నియామకానికి సెప్టెంబర్ 6 నుండి 11 వరకూ దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రొవిజినల్ మెరిట్ లిస్టు http//guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కావున ప్రొవిజినల్ మెరిట్ లిస్టు పరిశీలించి, ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తగు ధృవపత్రాలతో డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయంలో ఈనెల 7 నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని తెలియజేశారు. అభ్యర్థుల ఎంపిక రూల్‌ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఉంటుందని, కావున అభ్యర్థులు దళారులను నమ్మి మోస పోవద్దని చెప్పారు.

ఎమ్‌డియు ట్రక్ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్, సరుకులు ప్రజల ఇళ్ళ వద్దకు సరఫరా చేయటానికి ఖాళీగా ఉన్న 1 ఎండియు ట్రక్ ఆపరేటర్ భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ 1 నాటికి 21-45 ఏళ్లలోపు వయస్సు ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, నెలకు రూ.12వేల ఆదాయం కలిగి, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసిన తేదీ నుండి ప్రస్తుతం రెండు సంవత్సరాల పైబడిన ఎస్సీ, ముస్లిం, మైనార్టీ (బిసి-ఈ) లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 7 నుండి 11వ తేదీ వరకూ జిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఉపాసెల్ విభాగంలో దరఖాస్తు అందచేసి, రసీదు పొందాలన్నారు.

స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై కలెక్టర్ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిఎంసి కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నాయకులు ఆర్.భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య, వైసిపి నాయకులు అత్తోట జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఎస్ఎస్ఆర్ 2024 కు సంబంధించి ఓటర్ల క్లైయిమ్‌లను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందించటం వలన లక్షల్లో ప్రజలు అందించిన వివిధ క్లైయిములను ఓటరు నమోదు అధికారులు పరిష్కరించటం సాధ్యం అయ్యిందన్నారు. ఎస్ఎస్ఆర్ 2024 డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో ఉన్న జంక్ క్యారెక్టర్ ఓటరు కార్డులను సరిచేయటం జరిగిందని, మిగిలినవి వెంటనే సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒకే డోర్ నెంబరుపై పది కన్నా ఎక్కువ ఉన్న ఓట్లను ఇప్పటికే పరిశీలించటం జరిగిందని, మరోసారి రీ వెరిఫికేషన్ చేయటం జరుగుతుందన్నారు.ఎస్ఎస్ఆర్ 2024 కు సంబంధించి అన్ని ప్రక్రియలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించి 2024 జనవరి 5న జిల్లా ఓటర్ల తుది జాబితాను తప్పులు లేకుండా ప్రచురించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.రవిందరరావు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీకర్, జిఎంసి అడిషనల్ కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, ఏఈఆర్వోలు తహశీల్దారులు రవిబాబు, శ్రీకాంత్, రాంప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల వ్యర్థాలను సక్రమంగా తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఆసుపత్రుల నుంచి ఉత్పన్నమయ్యే బయో మెడికల్ వ్యర్థాలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా డిస్పోజల్ చేసేలా ఆసుపత్రి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనరు కీర్తి చేకూరితో కలసి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2016 జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ తొలి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులలో ఉత్పన్నమయ్యే బయోమెడికల్ వ్యర్థాలు బీఎండబ్ల్యు రూల్స్ ప్రకారం డిస్పోజల్ చేసేలా జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశమై పర్యవేక్షిస్తుందన్నారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఏపీ పొల్యూషన్ బోర్డు ఎన్విరాల్మెంట్ ఇంజినీరు కన్వీనర్‌గా, డీఎంహెచ్ఓ, పబ్లిక్‌హెల్త్ ఇంజినీరింగ్ ఈఈ, జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి, ఏపీ ఆసుపత్రులు, నర్సింగ్ హెూం అసోసియేషన్ ప్రతినిధి, జీజీహెచ్ సూపరింటెండెంట్, ఏఆర్ఎంఓ, డీపీఎంఓ, సేఫ్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టరు మెంబర్లుగా ఉంటారన్నారు. ఆసుపత్రులలో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను నిర్దేశించిన విధంగా ఎల్లో, రెడ్, బ్లూ, వైట్ బ్యాగ్‌లలో విభజించి బయోమెడికల్ వ్యర్థాలను డిస్పోజ్ చేసే సేఫ్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వాహనాలకు అందించాలన్నారు. వ్యర్థాలకు సంబంధించిన బ్యాగులను ఆన్‌లైన్‌లో ట్రాకింగ్ చేసే విధంగా బార్ కోడింగ్‌ను ఖచ్చితంగా స్కాన్‌చేసి డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఆసుపత్రులలో వ్యర్థాలను వేరు చేసేందుకు వైద్య సిబ్బందికి అవసరమైన శిక్షణతో పాటు రక్షణ పరికరాలు అందించాలని, సంబంధిత వ్యాక్సిన్లు ప్రతి ఆరునెలలకు ఒకసారి క్రమం తప్పకుండా వేయాలన్నారు. వ్యర్థాలను 48 గంటల్లో ఖచ్చితంగా డిస్పోజల్ ప్లాంట్ లకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీ పొల్యూషన్ బోర్డు ఎన్విరాల్మెంట్ ఇంజినీరు నారాయణ, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణబాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఎయిమ్స్ ప్రొఫెసర్ డి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా గుంటూరు నగరంలో వివిధ ప్రజాసంఘాలు, ప్రభుత్వ కార్యాలయాలల్లో, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కలిసి అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు బోడపాటి ఉషారాణి కిషోర్‌కుమార్, మల్లెబోయిన శ్రీవల్లి, ఈచంపాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. మేడ్ రాష్ట్ర కార్యాలయంలో అంబెద్కర్ చిత్ర పటానికి మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి బీమ్ భారత్ ఆధ్వర్యంలో బీమ్ భారత్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుల పాగళ్ల ప్రకాష్, న్యాయవాది వై.కె, ప్రసంగించారు.

ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 64వ వర్ధంతి కార్యక్రమం డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి -జిల్లా యంత్రాంగం :ఎంటీఎంసీ పరిధిలోనీ తాడేపల్లి మండలం ప్రాతూరు లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు డోకిపర్తి కోటయ్య, పుల్లగూర సుబ్బారావు పూలమాల వేసి నివాళులర్పించారు. చేబ్రోలులో తహశీల్దార్ కెవి గోపాల కృష్ణ, ఇతర అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలే వేసి నివాళులర్పించారు. పెదనందిపాడులో పాతబస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి గ్రామ సర్పంచ్ దాసరి పద్మారావు, వైసిపి మండల కన్వీనర్ షేక్ కాశిం పీర్, ఎస్‌టియు నాయకులు గేరా మోహనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పట్టణ వైసిపి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండిమెడలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం నాయకులు డి వెంకటరెడ్డి, బత్తుల సంసోను పూలమాల వేశారు. తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. తాడికొండ మండలంలో బడేపురంలో అంబేద్కర్ విగ్రహానికి నియోజకవర్గ సమన్వకర్త కత్తెర సురేష్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెనాలిలో తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక రైల్వే స్టేషన్ కూడలిలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పెదరావూరు, కఠెవరం, జగ్గడిగుంటపాలెం గ్రామాలలో పనిచేస్తున్న అంగన్వాడీలు తొలుత అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విగ్రహానికి సమర్పించారు. మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు జెవి రాఘవులు, ఎస్ఎస్ చంగయ్య, ఈమని అప్పారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలో గల అంబేద్కర్ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.




తాడేపల్లి మండలం గుండిమెడలో నివాళి



మంగళగిరిలో



జడ్‌పి కార్యాలయంలో



నివాళులర్పిస్తున్న మేయర్ కావటి




తెనాలిలో



నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం కలక్టరేట్‌లోని వీసీ హాల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి , డీఆర్ఓ కే.చంద్రశేఖరరావు , డియం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రావణ బాబు, డీడీ సోషల్ వెల్ఫేర్ మధుసూదనరావు, ఆర్డీఓ పి.శ్రీఖర్, జిఎంసి అడిషనల్ కమిషనర్ ఎస్.జ్యోతి, ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నాయకులు ఆర్.భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య, వైసిపి నాయకులు ఎ.జోసఫ్‌కుమార్ తదితరులు నివాళి అర్పించారు.



గుంటూరులో